జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..
WWW.DASHANEWS.COM
శుక్రవారం
23 01 2026
సంపుటి 1 సంచిక 62
పేజీలు : 04
RNI : TGTEL/25/A4195






# హైదరాబాద్‌లో 'మినీ దావోస్'

## వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులతో సీఎం రేవంత్

## సానుకూలంగా స్పందించిన ప్రతినిధులు

## తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ముందుకెళ్తామని సీఎం స్పష్టీకరణ

**దశ, హైదరాబాద్ (దావోస్):** తెలంగాణలో పారిశ్రామిక ప్రగతికి ఉన్న సానుకూల అవకాశాలు, అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు గురించి ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ పంచుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలన్న ఆలోచనలను వివరించారు. ప్రతి ఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం, దానికి ఫాలోఅప్‌గా హైదరాబాద్‌లో జూలై, ఆగస్టు నెలల్లో సమావేశం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదస్సు ప్రతినిధుల ముందు ప్రతిపాదించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులోని తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌కు చెందిన ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, ఫోరం డిజిటల్ ఎకానమీ స్ట్రాటజీ హెడ్ మంజు జార్జ్ తో సమావేశమయ్యారు. జూలై, ఆగస్టు నెలల్లో ఫాలోఅప్ సమావేశం

..మిగతా 4వ పేజీలో →

# తేలని టీజీపీఎస్సీ గ్రూప్ 1 వివాదం..

# హైకోర్టు తీర్పు మళ్లీ వాయిదా!



**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర గ్రూప్ 1 నియామకాలకు సంబంధించి హైకోర్టు తీర్పు మళ్లీ వాయిదా పడింది. తీర్పు కాపీ సిద్ధం కాలేదని, ఫిబ్రవరి 5న తుది తీర్పు వెల్లడించనున్నట్లు గురువారం (జనవరి 22) డివిజన్ బెంచ్ వెల్లడించింది. టీజీపీఎస్సీ గ్రూప్ 1 నియామకాలపై గతంలో సింగిల్ బెంచ్ స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై టీజీపీఎస్సీతో పాటు, గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన పలువురు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఆ అప్పీళ్లను విచారణ జరిపిన ధర్మాసనం స్టే ఎత్తి వేసింది. గతంలోనే విచారణ పూర్తి చేసింది కూడా. నియామకాలు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని విచారణ సమయంలో తెలిపింది. అనేక మలుపులు తిరిగిన గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్‌లో ఇప్పటికే నియామకాలు కూడా పూర్తయ్యాయి. మొత్తం 562 మందికి రేవంత్ సర్కార్ నియామక పత్రాలు సైతం అందజేసింది. దీనిపై తీర్పు ఈ రోజు వెలువడాల్సి ఉండగా.. ఫిబ్రవరి 5వ తేదీకి అది వాయిదా పడింది. టీజీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని, తిరిగి మూల్యాంకనం చేయాలని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటీషన్లు వేశారు. విచారణ జరిపిన సింగిల్ బెంచ్ పారదర్శకత లోపించిందన్న కారణంతో గ్రూప్ 1 మార్కుల తుది జాబితా, జనరల్ ర్యాంకులను రద్దు చేసింది. ఫలితాలు రద్దుచేసి, తిరిగి మూల్యాంకనం చేయాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. జవాబుపత్రాలను పునర్ మూల్యాంకనం చేయలేనిపక్షంలో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని సింగిల్ జడ్జి తీర్పు వెలువరించింది. అయితే ఆ తీర్పును సవాలు చేస్తూ టీజీపీఎస్సీతోపాటు, ఇప్పటికే గ్రూప్ 1 నియామక పత్రాలు అందుకున్న పలువురు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై హైకోర్టు గతంలోనే విచారణ పూర్తి చేసి, తీర్పు రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. అది మళ్లీ ఫిబ్రవరి 5కి వాయిదా పడింది.

## ట్యాపింగ్ కేసులో కెటిఆర్‌కు నోటీసులు

**దశ, హైదరాబాద్:**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు అధికారులను విచారించిన సిట్.. గురువారం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు నోటీసులు ఇచ్చింది. రేపు (శుక్రవారం, జనవరి 23) ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని నోటీసులో సిట్ ఆదేశించింది. కాగా, రెండు రోజుల క్రితం ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు ఇచ్చిన సిట్.. నిన్న ఆయనను విచారించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన హరీష్ రావును దాదాపు ఐదారు గంటల పాటు సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా తన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని హరీష్ రావుకు సిట్ అధికారులు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయనతోపాటు అనుచరుల ఫోన్లు కూడా ట్యాప్ అయినట్లు చెప్పారు.

## ముగిసిన సోదాలు

**దశ, హైదరాబాద్:**

హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఉదయం నుంచి హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడలో తనిఖీలు చేశారు. రూ.100 కోట్ల వరకు అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. ఏసీబీ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. అధునాతనమైన రెండు విల్లాలు, పది ఫ్లాట్స్, 14 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.50 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, మరికొన్ని బినామీ ఆస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది.

# నేటి నుంచి జాయి రైడ్

## మేడారం భక్తులకోసం హెలికాప్టర్ సేవలు

### 5 వేల రూపాయలతో ఏడు నిముషాల పాటు ఏరియల్ వ్యూ

**దశ, వరంగల్:** మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు శుభవార్త. జనవరి 23 నుంచి భక్తులకోసం హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు టూరిజం శాఖకు చెందిన జాయ్ సేవలు ప్రారంభించనున్నారు మంత్రి సీతక్క. తడ్వాయి మండలం ఎలుబాక నుంచి మేడారం ఏరియల్ వ్యూ చూసేందుకు హెలికాప్టర్ నడపనున్నట్లు తెలంగాణ టూరిజం శాఖ తెలిపింది. ములుగులో ఈ సేవలు ప్రారంభించనున్నారు మంత్రి సీతక్క. ఒక్కొక్కరికి 5 వేల రూపాయలతో ఏడు నిముషాల పాటు ఏరియల్ వ్యూ చూసే అవకాశం కల్పిస్తున్నారు

మేడారం జాతరలో ఏరియల్ వ్యూ హెలికాప్టర్ జాయ్ రైడ్ సేవలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సేవలు తెలంగాణ పర్యాటక శాఖ సహకారంతో



ప్రైవేట్ ఏవియేషన్ కంపెనీలు, ద్వారా నిర్వహిస్తున్నారు. జాతర సమయంలో భక్తుల రద్దీ, మేడారం ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని చూసే అదృష్టం ఈ విహంగ వీక్షణం కల్పిస్తుంది.

### ఏరియల్ వ్యూ జాయ్ రైడ్ వివరాలు

ఇది కేవలం మేడారం జాతర ప్రదేశంపైనే హెలికాప్టర్లో చిన్న సర్క్యూట్ రైడ్

..మిగతా 4వ పేజీలో →

### కశ్మీర్‌లో లోయలో పడిన ఆర్మీ వాహనం

# 10 మంది జవాన్లు మృతి

**దశ, జమ్మూకశ్మీర్:**

జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఆర్మీ వాహనం లోయలో పడిపోయింది. ఆ ఘటనలో 10 మంది జవాన్లు మరణించగా, మరో 9 మంది గాయపడ్డారు. బందేర్వాచంబా హైవేపై ఉన్న ఖన్ని టాప్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ఆర్మీ వాహనంలో సుమారు 17 మంది సిబ్బంది ప్రయాణిస్తున్నారు. ఆర్మీ వాహనం హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోయారు. సుమారు 200 ఫీట్ల లోతులో ఆ వెహికిల్ పడిపోయింది. ఆర్మీతో పాటు పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. నలుగురు సైనికులు మృతిచెందినట్లు గుర్తించామన్నారు. గాయపడ్డవారిలో కొందర్ని ఉదంపూర్ మిలిటరీ ఆస్పత్రిలో చేర్పించారు.

# వీధి కుక్కలను చంపిన వారిపై కఠిన చర్యలు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం
- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు మార్గదర్శకాలు జారీ.



**దశ, హైదరాబాద్ :** పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలను విషప్రయోగంతో చంపిన ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు మంత్రి సీతక్క తెలిపారు. వీధి కుక్కల బెడద ఉందన్న నెపంతో అమానుషంగా కుక్కలను చంపడం చట్టవిరుద్ధం మాత్రమే కాదని, మానవత్వానికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీతక్క పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామంలో వంద కుక్కలకు విషపూరిత ఇంజక్షన్లు ఇచ్చి చంపిన విషయం తెలిసిందే. గతంలో కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండల పరిధిలోని గ్రామాలలో 600 కుక్కలకు విషం పెట్టి చంపారు. యాచారం, కామారెడ్డి జిల్లాలో ఘటనలో సర్పంచ్, కార్యదర్శి, వార్డు మెంబర్‌పై జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం విధితమే. వీధి కుక్కల బెడద ప్రజలకు ఇబ్బందిగా ఉన్న మాట వాస్తవమేనని, వాటిని చంపడం చట్టరీత్యా నేరం మాత్రమే కాదు అని పర్యావరణ సమతుల్యతకు కూడా ముప్పు వాటిల్లుతుంది.

# సీటీలో రోడ్ల విస్తరణ



## హైదరాబాద్ వాసులకు హెచ్ఎండీఏ తీపి కబురు.

## నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం.

## ఎలివేటెడ్ కారిడార్లతో పాటు జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం.

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ వాసులకు హెచ్ఎండీఏ తీపి కబురు చెప్పింది. నగరం నుంచి ఓఆర్ఆర్ వరకు ట్రాఫిక్ లేని ప్రయాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. కొత్తగా ఎలివేటెడ్ కారిడార్లతో పాటు.. కొన్ని జాతీయ రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టింది. వ ఇప్పటికే చాలా వరకు ప్రాజెక్టులో మొదలు కాగా.. మరికొన్నింటికి టెండర్లను ఆహ్వానించింది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో భూ స్థాయిలో 4 లైన్ల రోడ్డును.. దాంతో పాటే 6 లైన్ల రోడ్డుతో రెండు భాగాలుగా అనుసంధానం చేసే ప్రణాళికలను హెచ్ఎండీఏ చేపట్టింది. హైదరాబాద్ మహానగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రభుత్వం భారీ రహదారుల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా నగరం మధ్యలో నుంచి ప్రయాణ సమయాన్ని తగ్గించేలా 6 లైన్ల రహదారుల నిర్మాణం.. ప్రస్తుతం ఉన్న 3 లైన్ల రోడ్లను 4 లైన్లుగా మార్చే పనులకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఐటీ కారిడార్‌లో అత్యంత రద్దీగా ఉండే నానక్‌రాంగూడ నుండి గచ్చిబౌలి వరకు ఉన్న ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఇక్కడ సర్వీసు రోడ్డు కాకుండా ప్రధాన మార్గం మూడు వరుసలుగా ఉంది. గచ్చిబౌలి జంక్షన్ వద్ద కొత్తగా నిర్మించిన ఫ్లైఓవర్ల కారణంగా వాహనాల రాకపోకలు పెరిగి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఈ రహదారిని 4 లైన్ల మార్గంగా మార్చనున్నారు. దీని కోసం ప్రభుత్వం సుమారు రూ. 26.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా

..మిగతా 4వ పేజీలో →

## బాధితుల ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

**దశ, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీసులు తొలిసారి బాధితుల ఇంటి వద్ద తొలి ఎఫ్ఐఆర్ ను నమోదు చేసారు. నడిగూడెం పోలీసులు ఇంటి వద్దే ఎకఫ్ఐఆర్ నమోదు చేసారు. బాధితుల ఫిర్యాదుపై ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కార్యాచరణ అమలు చేయడంలో భాగంగా నడిగూడెం పోలీసులు జిల్లాలో మొదటి కేసు నమోదు చేసినారని ఎస్పీ నరసింహ తెలిపారు. నడిగూడెం మండలం తెల్లబెల్లి గ్రామానికి చెందిన వికాళాంగురాలు భూమా రమాదేవిని భర్త వేధిస్తున్నాడు, కొడుతున్నాడు అని డయల్ 100 కు ఫోన్ చేయగా సంచారం అందుకున్న నడిగూడెం ఎస్ఐ అజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి బాధితురాలి ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి అక్కడే కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని బాదితురాలికి అందించారని అన్నారు. ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్* కార్యక్రమం ద్వారా మహిళలపై, పిల్లలపై, వృద్ధులపై దాడులు, దొంగతనాల, భౌతిక దాడులు, బాల్య వివాహాలు, వేదింపులు వట్టి సందర్భాల్లో బాధితులకు భరోసాగా ఉంటుంది, ఇంటికి వెళ్లి కేసు నమోదు చేయడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు. మొదటి కేసు నమోదు చేసిన నడిగూడెం పోలీసులను ఈ సందర్భంగా అభినందించారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

❖ *గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య.*




**దశ. సంగారెడ్డి:** సంగారెడ్డిజిల్లాలోగ్రామాలసర్వతోముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. గురువారం సంగారెడ్డి పట్టణంలోని దుర్గాబాయి దేశముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల మొదటి బ్యాచ్ ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాలకు మంచి జరగాలంటే సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టం-2018పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఆరు బ్యాచులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీల పనుల నిర్వహణ, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన, అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమం, విద్య, ప్రజారోగ్యం, సామాజిక అభివృద్ధి వంటి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణను సర్పంచులు సద్వినియోగం చేసుకుని తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డి పి ఓ జానకి రెడ్డి , డీఎల్పీఓలు అనిత, అమృత, సంజీవరావు, పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా సూర్యాపేట జిల్లాను అభివృద్ధి చేస్తా

❖ *5 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన టూరిజం బోర్డ్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి*



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లాను పర్యాటకరంగా ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సద్దలచెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద 5 కోట్ల నిధులతో ట్యాంక్ బండ్ ఆధునీకరణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం సూర్యాపేట సద్దలచెరువు మినీ ట్యాంక్ బండ్ ను నిర్లక్ష్యం చేస్తూ అభివృద్ధికి దూరం చేసిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మినీ ట్యాంక్ బండ్ కు అనేక నిధులను కేటాయిస్తుందని కోటి రూపాయలతో 80 సీట్ల ఏసీ బోటింగ్, అదేవిధంగా 15 కోట్లతో ఇంటర్నేషనల్ పార్కును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పిల్లలు ఆడుకోవడానికి ప్లేయింగ్ జోన్ పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మినీ ట్యాంక్ బండ్లను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, వుర రామ్మూర్తి యాదవ్, వెలుగు వెంకన్న, ముదిరెడ్డి రమణారెడ్డి, ఫారుక్, వల్దాస్ దేవేందర్, నిమ్మల వెంకన్న, యాట వెంకన్న, పోలగాని కృష్ణ, కొండగడుపుల సూరయ్య, సైదిరెడ్డి, టూరిజం శాఖ ఏఈ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో శుభ్రత వాతావరణం కనిపించాలి

❖ *విద్యార్థులకు నాణ్యత భోజనం అందించాలి*
❖ *కలెక్టర్ జితేష్ పాటిల్*
❖ *మార్కోడు ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** మార్కోడు గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం తరగతి గదులు హాస్టల్ గదులు మరుగుదొడ్లు డైనింగ్ హాల్ తదితర మౌలిక వసతులను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. మరుగుదొడ్ల పరిశీలన సమయంలో నీటి సరఫరా సక్రమంగా లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, తక్షణమే చర్యలు తీసుకొని నిరంతర నీటి సరఫరా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో పాఠశాల భవనంలో లికేజీ సమస్య ఉన్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా అవసరమైన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, స్టాక్ రిజిస్టర్లు, వంట నిర్వహణ విధానాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు శుభ్రమైన, పోషకాహారంతో కూడిన రుచికరమైన భోజనం తప్పనిసరిగా అందించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన



చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణానికి అవసరమైన నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వంటకట్టెలపై ఆధారపడుతున్న పరిస్థితిని గమనించిన కలెక్టర్ గ్యాస్ సరఫరా ఏర్పాట్లకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

అనంతరం మూడవ ఆరవ ఎనిమిదవ తరగతుల గదులను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. విద్యను అభ్యసించడంలో శ్రద్ధ చూపాలని జీవిత లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని సమయాన్ని వృథా చేయకుండా చదువుపై పూర్తి దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాలను పరిశీలిస్తూ బోర్డుపై రాయించి పుస్తకాలు చదివించి వారి అభ్యాస స్థాయిని పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షిత వాతావరణంతో పాటు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, పోషకాహారం తప్పనిసరిగా అందాలని తెలిపారు. పాఠశాలల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని, చిన్న లోపం కూడా విద్యార్థుల ఆరోగ్యం భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అన్నారు. మరుగుదొడ్లు, నీటి సరఫరా, హాస్టల్ వసతులు ఎల్లప్పుడూ సక్రమంగా ఉండేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మార్కోడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న కొత్త తరగతి గదులు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించి, పది రోజుల్లోగా అన్ని పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని ఎలాంటి లోపాలు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా చేపడుతున్న నిర్మాణాలకు అవసరమైన విద్యుతీకరణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయులు ముత్తయ్య, రామకృష్ణ, బోధన సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్లైన్ ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా

❖ *జిల్లాలో 'మన ఇసుక వాహనం పైలట్ ప్రాజెక్ట్ అమలు*
❖ *జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా సరఫరా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నిల్వలు అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర గనులు భూగర్భ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సమావేశంలో మన ఇసుక వాహనం ఆన్లైన్ వ్యవస్థ పని విధానం ఇసుక బుకింగ్ విధానం రవాణా అనుమతులు జీపీఎస్ ట్రాకింగ్ చెల్లింపుల విధానం ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి అనుమతి ప్రతి రవాణా ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న




రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్‌ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తాసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా నిల్వలు ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు. ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా వేగంగా నమ్మకంగా అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో మైనింగ్ అధికారులు మండల స్థాయి తహసిల్దార్లు ఎంపిడివోలు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## సూర్యాపేట జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల అవగాహన ర్యాలీ

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత మహా ఉద్యమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో విద్యార్థులు, ఆటోలు, బారి వాహనాల డ్రైవర్స్, స్థానిక యువత, పౌరులతో కలిసి బారి రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ హాజరై ప్రారంభించారు. స్థానిక 60 ఫీట్ల రోడ్డు నుండి ప్రారంభమైన నల్లాభావి సెంటర్, వాణిజ్య భవన్, శంకర్ విలాస్ సెంటర్, ట్యాంక్ బండ్ చౌరస్తా ల మీదుగా AVM స్కూల్ వరకు నిర్వహించారు. అనంతరం AVM స్కూల్ నందు ఏర్పాటు చేసిన సమావేశం నందు ఎస్పి విద్యార్థులను, డ్రైవర్లను ఉద్యేసించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, రూరల్ సీఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఆర్టిసి డివిజనల్ మేనేజర్ సునీత, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆదిత్య, ఎస్ఐ లు సాయిరాం, బాలు నాయక్, ఏడుకొండలు, శివతేజ, మహేందర్, బాలు నాయక్, శ్రీకాంత్, మహేష్, ఆటోమొబైల్ షో రూమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాచర్ల కమలాకర్, పోలీసు సిబ్బంది, ఆర్టీఏ సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# మానవులు అందరికీ దేవుడు ఒక్కడే అని చాటి చెప్పే సర్వ మత సమ్మేళనం

❖ *టేక్మాల్ శాహేదల్లా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు!!*
❖ *నేటి నుండి ప్రారంభం 25వతేదీనముగింపు!!*

**దశ, టేక్మాల్:** మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం లో మానవత్వానికి దైవత్వానికి అను సందానమే "భక్తి" అనే నానుడిని చాటుతూ...చిన్న, పెద్ద ,తారతమ్యం లేకుండా అన్ని మతాల వారిని ఒక్క చోటకు చేర్చి...భగవంతుని దృష్టిలో మానవులు అందరూ సమానులు అని చాటి చెప్పే ఫీర్ షాహ్ మహమ్మద్ మారుఫ్ హజ్రత్ శాహెదల్లా ఖాద్రీ (ర.అలై) 197 సంవత్సరం ఉర్సు ఉత్సవాలు (శాబాన్3,4,5,) ఈ నెల ,23, 24,25 వ తేదీన టేక్మాల్ దర్గా ఆశ్రమంలో జరగనున్నాయి. ప్రతి సంవత్సరం ఉర్సు ఉత్సవాలు జరపటం అనవాయితిగా వస్తుంది. ప్రతి సంవత్సరం శాబాన్ నెలల్లో శాహెదల్లా ఖాద్రి ఉర్సు ఉత్సవాలు టేక్మాల్ ఆశ్రమంలో సాంప్రదాయ బద్దంగా అత్యంత వైభవంగా జరుగుతాయి.శాహెదల్లా ఖాద్రీ (ర.అలై )యొక్క వంశ పరంపర పన్నెండు శకంలో హజ్రత్ బాబా ఫరీద్ మసూవుద్ గంజె శకర్ (ర.అలై)తో కలుస్తుంది.వీరు ఫారోఖీ హజ్రత్ ఫారొఖై ఆజమ్ రజి అల్లా షతరలా "అన్హు"వంశంకు చెందిన వారని చరిత్ర ఉంది.

ఫీర్ శాహెదల్లా ఖాద్రీ (ర.అలై) దైవస్వరూపులు అని భక్తుల విశ్వాసం. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ లో హజ్రత్ మహ్మద్ రజా ఫారోఖీ(అలియాస్)రజామియా గృహంలో




1175.హిజ్రిలో దివ్య జ్యోతిగావెలుగొందారు. విరి తాత గారు హజ్రత్ షేక్ మహ్మద్ హమిద్ అలియాస్ కరీముల్లా త:హజ్రత్ షేక్ ఫత ఉల్లా (ర.అలై )పాక్ పటాన్ నుండి కర్నూల్ కు వలస వచ్చి కర్నూలు ను తమ చిరకాల నివాసంగా ఏర్పాటు చేసుకున్నారు అని చరిత్ర ఆధారంగా తెలుస్తుంది.1200 హిజ్రిలో విరి అధ్యాత్మిక గురువు గారైన హజ్రత్ మగ్దుమ్ మోహిద్దిన్ (సయ్యాదామియా)(ర.అలై) విరికి ఖాద్రి చిష్తి,అందు శిష్యునిగా ఉపదేశం





ప్రసాదించారు. హజ్రత్ శాహెదల్లా ఖాద్రి గారు నలభై ఏళ్ల వయస్సులో కర్నూల్ నుండి హైదరాబాద్ వచ్చినట్టు చరిత్ర.1249 హిజ్రిలొ టేక్మాల్ లో తమ పవిత్ర ఆత్మ పరమాత్ముని యందులినమైనారు.శాహెదల్లా ఖాద్రి టేక్మాల్ కు నాలుగు సార్లు వచ్చారు అనిచరిత్ర చెబుతోంది.ఒక్క మారు 1243 హిజ్రిలొ హజ్రత్ సాహేబ్ హుస్సేన్ గారి కుమారుని మరణా వార్త విని వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియ పర్చడానికి వచ్చారుఅని,1245 హిజ్రి లొ మరొ మారు వచ్చి వారం రోజుల పాటు టేక్మాల్ లొ ఉన్నారు.1248 హిజ్రిలో సాహేబ్ హుస్సేన్ గారికి "పుత్రబాగ్యం" కలిగిందని మూడవ మారు టేక్మాల్ కు వచ్చారు. ఆ సమయంలో నే "టేక్మాల్ " స్థిరనివాసం ఏర్పాటు చేసుకొమ్మని ఆయన శిష్యులువేడుకొన్నారు.1249 హిజ్రి శాబాన్ నెల రెండవ తేదీన శనివారం ఉదయం వీరి ప్రియ శిష్యులైన సాహేబ్ హుస్సేన్ గారిని తన చెంతకు చెర్చుకొని అప్పుడు శాహెదల్లా ఖాద్రి గారు అధ్యాత్మిక పుస్తకాలు, అందించిన తర్వాత అందరు భోజనాలు చేశారా?నాయనా? నా సమాధి పూర్తయ్యిందా? అని ప్రశ్నించారు శిష్యులనుండి సమాధానం అందుకున్న కొద్ది సమయంలోనే అనూహ్యమైన శక్తి, తప శక్తి, బాహ్యమైంది.

"అల్లాహూ అనే దివ్య శబ్దంతొ" ఆ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. ఆ ప్రాంతం అంతా సుగంధ భరితమై దివ్య క్రాంతమైంది. పలు మహిమల ఫలితంగా శాబాన్ నెల రెండవ తేది1249 హిజ్రి కీర్తి శకం 1834 సంవత్సరం అధ్యాత్మిక బొధనలు, అల్లహూ మహిమలు చూపిన పిదప తమ పంచ ప్రాణాలు వదిలిపెట్టి ఐక్యం అయ్యారు.శరీరం నుండి ప్రాణాలు కోల్పోయిన దివ్య శక్తులు మాత్రం వేరుకావన్న సత్యాన్ని శాహేదల్లా ఖాద్రి నిరూపించారు. అప్పుటి నుండి ప్రతి సంవత్సరం ఫీర్ హజ్రత్ శాహెదల్లా ఖాద్రి గారి ఉర్సు 3వ మరియు 4 వ శాబాను హిజ్రి నాడు ఉత్సవాలు టేక్మాల్ ఆశ్రమంలో జరుగుతాయి.3వ శాబాన్ రోజున సందల్, 4,వ శాబాన్ రోజున దీపారాధన, ఖవ్వాలి, 3వ రోజున కార్యక్రమాల వితరణ కార్యక్రమాలు చేపడుతారు.ఉర్సు ఉత్సవాల కోసం శాహెదల్లా ఖాద్రి దర్గా రంగురంగుల విద్యుత్ దీపాలఆలంకణతో,కన్నులు మిర్ మిట్లు గొలిపే వివిధ విద్యుత్ దీపాలంకరణ కాంతులతో చకచకా ముస్తాబు అవుతోంది. ఈ ఉర్సు ఉత్సవాలను కుల మతాలకతీతంగా అందరూ భక్తి శ్రద్దలతో జరుపుకొవడం విశేషం. ఇక్కడ ఉన్న గురువుల సమాధులు ముస్లిలవైన్నప్పటికి, "సూఫీయిజాన్ని" చాటే ఈ దర్గా ఉత్సవాలకు అన్ని మతాలవారు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

మానవులందరి "దేవుడు ఒక్కడే" అని చాటి చెప్పిన శాహెదల్లా ఖాద్రి సర్వ మత సమ్మతం,మత సామరస్యనికి ప్రతికగా నిలుస్తాయి అనడానికి ఈ ఉత్సవాలు అద్దం పడుతొంది. మనిషి మనిషికి అడ్డ గొడలుగా ఏర్పడిన కుల వ్యవస్థ, మత జాడ్యంలొ మునిగి నైతిక విలువలు అధ్యాత్మిక చింతనకు దగ్గరై... హింసకు దూరమై సర్వమత సామరస్యం, ప్రేమ తత్వం, దైవత్వనికి సుమార్గం నిజమైన మాన వత్వం,తనను తాను తెలుసుకొనే మార్గాన్వేషణ తెలుస్తుంది. దేవుని దృష్టిలో మానవులు అందరూ సమానమే చాటే ఉర్సు ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుజరుగుతున్నాయి. శాహెదల్లా ఖాద్రి ప్రజల దృష్టిలో ఆరాధ్యదైవంగా నిలిచారు.ఇక్కడ హిందు, ముస్లింలు, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సమైక్యంగా ప్రార్థనలు చేస్తారు. ఖురాన్,అధ్యాత్మిక కార్యక్రమాల ప్రబోధనలు ప్రవహిస్తాయి. పేదలు,ధనికులు,విభిన్న జాతులవారు,అందరూ అదరించబడుతారు. శాహేదల్లా ఆశ్రమంలో ప్రార్ధనలు చేయడం వల్ల కోరిన కొరిక్కలు నెరవెరుతాయని ప్రజలు, భక్తుల ప్రగాఢ విశ్వాసం. తమ తమ మొక్కులు మెక్కిన భక్తులు, కోరికలు నెరవేరిన భక్త జనులు బీదలకు దాన దర్మాలు (నియాజు)చేస్తారు. మానసికంగా గాయ పడ్డా దీన జనులకు ఈ ఆశ్రమంలో అధ్యాత్మిక ప్రబోధనలతో మనశాంతి కలుగుతొంది. ఉర్సు ఉత్సవాలు టేక్మాల్ దర్గా ఫీఠదిపతి హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హుసేన్ ఖాద్రి ఆధ్వర్యంలో జరుగుతాయి. ఉర్సు ఉత్సవాలు ఈ నెల ,23,2,4,25వతేదీల్లో జరగనున్నట్లు ఆశ్రమ ఫిఠాదిపతి నురూల్లా హుస్సేన్ ఖాద్రితెలిపారు.

శాహేదల్లా ఉర్సు ఉత్సవాలు ప్రారంబ సూచకంగా మొదటి రోజున 23వ తేదిన శుక్రవారం నాడు టేక్మాల్ పట్టణంలోని క్రింది వాడ (గల్లీ) నుండి గ్రంథం ఊరేగింపు తిస్తారు.24వ తేదిన హమ్ దావత్, ఖవ్వాలి,నాతే మైఫిల్, ధార్మిక, ప్రవచనాలు, నాత్ ,25వ తేదిన వితరణ కార్యక్రమం ఉంటుందని ఖాద్రి తెలిపారు.శాహేదల్లా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాల కోసం కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, గుల్బర్గా, బీదర్, డిల్లీ ,ప్రాంతాలతో పాటు, విదేశాలనుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక వసతులు,ఉచిత భోజనం,మంచి నీళ్ల సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు ఉర్సు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయ వంతం చేయాలని అహ్మద్ నూరుల్లా హుస్సేని ఖాద్రి కొరారు.

# శ్రీకేతకి సంగమేశ్వర స్వామి జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి

❖ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**దశ, సంగారెడ్డి:** మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు జరగనున్న ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు. శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర నిర్వహణ ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావుతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల ద్వారా చేపట్టనున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మహిళా భక్తులకు ప్రత్యేకంగా అధిక సంఖ్యలో టాయిలెట్లు, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, స్నానాలకు అవసరమైనన్ని షవర్లు, మంచినీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దేవస్థానం వరకు వెళ్లే కనెక్టివ్ రోడ్లను మరమ్మతులు చేయించి గుంతలు పూడ్చాలని, అవసరమైన చోట సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జాతర ఆవరణతో పాటు దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం సక్రమంగా జరిగేలా చూడాలని, ఎక్కువ మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించుకోవాలని, బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులనుఆదేశించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతర ప్రాంతంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, 108 అంబులెన్స్ వాహనాన్నిఅందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు దేవస్థానం పరిసరాల్లో అగ్నిమాపక పరికరాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సంబంధిత అధికారులకుసూచించారు. భద్రతాపరంగా గుడిలోపల, బయట, గుడి ఆవరణలో, పార్కింగ్ ప్రాంతాలవద్దపటిష్టమైనపోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేయాలని, మహిళల స్నాన ప్రాంతాల్లో మహిళా పోలీస్ సిబ్బందిని నియమించాలని పోలీస్ శాఖ అధికారులకు తెలిపారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. భక్తుల ఆహ్లాదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు దివ్యాంగ భక్తుల కోసం వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా సంక్షేమ అధికారికి తెలిపారు. దేవస్థానం వద్ద మరో సారి ఆయా అధికారులు అందరితో మీటింగ్ ఏర్పాటు చేయాలని, అన్ని శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, షిఫ్ట్ వారీగా అధికారుల వివరాలు పొందుపరచాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే ఆర్డీవో లేదా తన దృష్టికి తీసుకురావాలని దేవస్థానం ఈవోకు సూచించారు.

ఈ సందర్భంగా జహీరాబాద్ శాసన సభ్యులు మాణిక్ రావు మాట్లాడుతూ, ప్రతి శాఖ అధికారి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, రోజువారీ పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా జరిగేలా చూడాలని, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు మాట్లాడుతూ, ఫిబ్రవరి 14 నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళల స్నాన ప్రాంతాల్లో మహిళా పోలీసులను నియమించి, కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో మరియు డిపిఓ జానకి రెడ్డి, జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి దేవుజా, ఆయా శాఖల అధికారులు, ఝరాసంగం తహసిల్దార్, దేవస్థానం ఈవో శివ రుద్రప్ప, చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, గ్రామ సర్పంచ్ వినోద, తదితరులు పాల్గొన్నారు.

## నో హెల్మెట్.. నో పెట్రోల్



**దశ ఎల్లారెడ్డిపేట:** రోడ్డు భద్రత జాతీయ మాసోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆదేశానుసారం ప్రతి పెట్రోల్ బంక్ యజమానులు తమ బంక్ లో నో హెల్మెట్ .. నో పెట్రోల్ ను సామాజిక బాధ్యతగా అమలు చేయాలని ఎల్లారెడ్డిపేట ఎస్సై కే రాహుల్ రెడ్డి తెలిపారు.రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయని,వాహనదారుడు క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చని ఎస్ ఐ తెలిపారు. పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు చేయాలని, వాహన దారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకొని వాళ్ళ ప్రాణ రక్షణ చేసుకునే విధంగా చేయుటకు ఈ నో హెల్మెట్ నో పెట్రోల్ విధానం ను ప్రతీ ఒక్క ప్రయాణికుడు విధిగా పాటించాలని కోరారు.

## డ్రైనేజీ సమస్యకు సత్వర పరిష్కారం: సర్పంచ్



**దశ, కారేపల్లి:** గ్రామస్తుల చిరకాల వాంఛ అయిన సైడ్ డ్రైనేజీ సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి.2 సంవత్సరాలనుండి సర్పంచ్ లు లేక గత కొంతకాలంగా బొక్కలతండలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ హనుమంతరావు, పంచాయతీ సెక్రటరీ రమేష్ తక్షణమే స్పందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రజలకు ఇబ్బంది కలగ కుండా తాత్కాలిక మర మ్మతులు చేపట్టాం. రానున్న రోజుల్లో ఈ సమస్య మళ్లీ తలెత్తకుండా, శాశ్వత ప్రాతిపదికన పక్కా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సమస్యను గుర్తించిన వెంటనే స్పందించి పరిష్కారం చూపిన సర్పంచ్ హనుమంతరావు, సెక్రటరీ రమేష్‌కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆహార నాణ్యతలో తేడా వస్తే వేటు తప్పదు

*హోంగార్డ్ నుండి ఎస్పీ వరకు ఒకే ఆహారం అందించాలి: ములుగు ఎస్పి సుధీర్ రామనాథ్ కేకాన్*



**దశ, ములుగు:** తెలంగాణ కుంభమేళా గా పేరొందిన ములుగు జిల్లా మేడారం జాతర విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి అందిస్తున్న భోజన ఏర్పాట్లను గురువారం మేడారంలో పోలీస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన మెస్ ను ములుగు జిల్లా ఎస్పీ రామనాథ్ కేకన్ స్వయంగా పరిశీలించారు. మెస్‌లో భోజన నాణ్యతను పరిశీలించి, అన్ని ర్యాంకుల అధికారులు, సిబ్బంది తో పాటు పారిశుధ్య కార్మికులకు కూడా సమానమైన, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ఆదేశించారు.భోజనం పరిశుభ్రత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ స్థాయి అధికారి స్వయంగా తీసుకునే ఆహారమే బందోబస్తు విధుల్లో ఉన్న ప్రతి సిబ్బందికి అందించాలని ఆహార విభాగం ఇన్‌చార్జ్ అధికారులను ఆదేశించారు.బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యం, భద్రత అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఎస్పీ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఓఎస్డి శివమ్ ఉపాధ్యాయ,ఏఎస్పి ఏటూరునాగారం మనన్ బట్,ఎస్బి సిఐ శంకర్, ఏటూరునాగారం సిఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నియమాలను పాటించడం మనందరి బాధ్యత

❖ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** ట్రాఫిక్ నియమాలను పాటించడం మనందరి బాధ్యత అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు బజార్ వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతిష్టాత్మకంగా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని ప్రసంగించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల ప్రమాదాలు జరగవని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురై చాలామంది తమ ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో పోలీసు వారు తీసుకునే చర్యలకు ప్రజలందరూ సహకరించాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో భాగంగానే నిత్యం పోలీసులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించే విధంగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రయాణించటం వలన ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టడం కోసం పోలీసులు శ్రమించడం హర్షనీయమని కొనియాడారు. ప్రజల భద్రత సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్న పోలీస్ శాఖకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, కొత్తగూడెం టూ టౌన్ సిఐ ప్రతాప్, 3టౌన్ సీఐ శివప్రసాద్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్, ఎస్సై విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్



**దశ, సంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సంగారెడ్డి రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన యువ నాయకులు లాడే బాలు పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులు సుమారు వంద మందితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇటీవలే పొన్న రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడిన విషయం తెలిసిందే. తాజాగా సంగారెడ్డి పట్టణంలోని 9వ వార్డు యువ నాయకుడు లాడే బాలు పార్టీని విడిచి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ఆధ్వర్యంలో, మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో లాడే బాలు బీఆర్ఎస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో తమకు తగిన గుర్తింపు, లేవని, అందుకే పార్టీని వీడుతున్నట్లు లాడే బాలు ఈ సందర్భంగా తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి వరుసగా నాయకులు బీఆర్ఎస్‌లో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చేరికతో బీఆర్ఎస్ పార్టీ మరింత బలపడిందని, "సంగారెడ్డి గడ్డపై గులాబీ జెండానే ఎగరాలి" అనే నినాదం మరోసారి ప్రతిధ్వనించిందని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

❖ ఇల్లు లేని ప్రతి లబ్ధిదారునికి ఇల్లు ఇస్తాం

❖ పదో వార్డు మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్ కుమార్



**దిశ,ఆందోల్ :** సంగారెడ్డి జిల్లా ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని పదవ వార్డులో నూతన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పదవ వార్డు మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్ కుమార్ గురువారం భూమి పూజ చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ పదవ వార్డుకు నూతనంగా 12 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇల్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న 5 లక్షల ఆర్థిక సాయం పొందాలని తెలిపారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీనియర్ నాయకులు గుర్రపు కృష్ణ, రాజు, రామ్ చందర్ , వినయ్,మున్సిపల్ అధికారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం






**దశ, అందోల్-జోగిపేట:** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని జోగిపేట పట్టణం గల మైనార్టీ బాలుర కళాశాల లో వచ్చే విద్యాసంవత్సరానికి గాను (20262027) సంబంధించి ఇంటర్మీడియట్లో మొదటి సంవత్సరంలో సీ.ఈ.సీ మరియు ఎం.ఈ.సీ గ్రూపులకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుంది అని కళాశాల ప్రిన్సిపల్ పి.జీవిందర్ తెలిపారు. మైనారిటీ (ముస్లిం, క్రైస్తవ, సిక్కుల, జైన్, పార్సీ మరియు బౌద్ధులు) ల కొరకు 75% సీట్లు మరియు నాన్ మైనారిటీల ( యస్.సి, యస్.టి మరియు బీ.సీ) ల కొరకు 25% సీట్లు రిజర్వ్ చేయబడినవని తెలిపారు. ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా (www.tgmries. telangana.gov.in) 5 TGMREIS యాప్ ద్వారా గాని నేరుగా జోగిపేట లో గల మైనార్టీ గురుకుల కళాశాలకు వెళ్లి ఫిబ్రవరి 28 తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం క్రింది నంబర్లను సంప్రదించగలరు 720799852, 9701995801, 9059667457.

## ఆదివాసి ప్రజల సంక్షేమమే లక్ష్యం

❖ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



దశ, భద్రాద్రి కొత్తగూడెం: **ఆదివాసీ ప్రజల సంక్షేమం అభివృద్ధి** కొరకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కృషి చూస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొమరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏడ్పుల గూడెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీల సంక్షేమం అభివృద్ధి కోసం పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఆదివాసీ ప్రజలకు కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువత పిల్లలు విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం రోడ్డు ప్రమాదాలు సైబర్ క్రైమ్స్ పోక్సో కేసుల గురించి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నిత్యం హెల్మెట్ ధరించి మాత్రమే ద్విచక్ర వాహనాలను నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా అక్కడ నివసించే 100 కుటుంబాల వారికి హెల్మెట్లు దుప్పట్లు పంపిణీ చేశారు. పిల్లలకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని యువతకు ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంటును ఎస్పీ ప్రారంభించారు. కొమరారం పోలీస్ స్టేషన్ ను సందర్శించి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ విధులలో ఉండే అధికారులు సిబ్బంది కొరకు నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ క్వార్టర్స్ పనులను పరిశీలించారు. ఇట్టి కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, ఇల్లందు సీఐ సురేష్, టేకులపల్లి సీఐ సత్యనారాయణ, గుండాల సీఐ తిరుపతి, ఎస్సైలు రాజేందర్, రవూఫ్ లు పాల్గొన్నారు.



# కేబీఆర్ పార్క్ చుట్టూ సిగ్నల్ ఫ్రీ జంక్షన్

**దశ, హైదరాబాద్**

కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం నెలరోజుల్లో ప్రారంభం కానుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతితో, రూ.1090 కోట్లతో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌జీటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సాయిల్ టెస్ట్ జరుపుతున్నారు. నిర్వాసితులకు టీడీఆర్ ఇచ్చేందుకు అంగీకరించారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.కేబీఆర్ పార్క్ ప్రాంతంలో ట్రాఫిక్ మామూలుగా ఉండదు. ఈ సమస్య పరిష్కారం కోసం కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని తీసుకున్న నిర్ణయం ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. మరో నెలరోజుల్లోగా ఈ పనులు ప్రారంభం అవుతాయని సమాచారం. ఈ ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతి లభించడంతో పనులు త్వరలోనే మొదలవుతాయని భావిస్తున్నారు. రెండేళ్లలో ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం ఈ ప్రతిపాదిత ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణంలో భాగంగా నేల పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి హెచ్‌సిటీ ( హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ప్రోగ్రామ్ కిందకు వస్తాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ చుట్టూ ఉండే భారీ ట్రాఫిక్‌ను తగ్గించవచ్చు. ముఖ్యంగా ఐటీ కారిడార్ వైపు అంటే మదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మణికొండ వైపు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.ఎందుకంటే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10, 12, జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, మాసాబ్ ట్యాంక్ మార్గాల్లో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఉదయం, సాయంత్రం ఆఫీసు సమయాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్ల మీద నిలిచిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని భావించిన సర్కార్.. ఈ మార్గంలో సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల కోసం 6 ఫ్లైఓవర్లు, 6 అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు గాను ప్రభుత్వం రూ. 1090 కోట్ల వ్యయానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాంతాన్ని సిగ్నల్ ఫ్రీ కారిడార్‌గా అభివృద్ధి చేయడం వల్ల వాహనదారుల ప్రయాణ సమయం చాలా వరకు తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. సంవత్సరన్నర క్రితమే నేల పరీక్షలు చేసినా.. భూసేకరణ ఇబ్బందుల వల్ల ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు.ఈ క్రమంలో తాజాగా బల్దియా.. ప్రాజెక్టు వల్ల ఆస్తులు కోల్పోతున్న వారికి టీడీఆర్ ఇస్తామని

హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో ప్రస్తుతం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి సంబంధించి సాయిల్ టెస్టింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. దీని ఆధారంగా ఫ్లైఓవర్ల డిజైన్, నిర్మాణ విధానం, పిల్లర్ల ఎత్తును ఖరారు చేయనున్నారు. మరో రెండు రోజుల్లోనే సాయిల్ టెస్టింగ్ పూర్తి కానుందని, ఈ నేపథ్యంలో వచ్చే నెలలో నిర్మాణానికి సంబంధించిన పనులు మొదలుపెట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వల్ల సామాన్య ప్రజలతో పాటు కొన్ని వాణిజ్య సంస్థలు కూడా తమ ఆస్తులను కోల్పోతున్నాయి. ఈ క్రమంలో అధికారులు వీరికి పరిహారం గురించి ఒప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఒకవేళ నగదు పరిహారం కోరితే అక్కడున్న మార్కెట్ రేటుకు 2 రెట్లు ఎక్కువ ఇవ్వనున్నారు. లేదంటే టీడీఆర్ కోరితే మార్కెట్ విలువకు నాలుగు రెట్లు ఎక్కువ ఇస్తామని చెబుతున్నారు.

# టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లా ఔట్..

మరికొన్ని రోజుల్లో టీ20 వరల్డ్ కప్ జరగనున్న వేళ.. బంగ్లాదేశ్ సంచలన నిర్ణయం తీసుకుంది. భారత్‌లో ఆతిథ్యం ఇస్తున్న ఈ పొట్టి ప్రపంచకప్ ఆడకూడదని నిర్ణయించుకున్నట్లు ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో తాము ఆడే మ్యాచ్‌లను భారత్‌లో కాకుండా.. శ్రీలంకలో నిర్వహించాలన్న విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించడంతో బంగ్లాదేశ్ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్ తప్పుకుంటే.. ఆ స్థానంలో స్కాట్లాండ్ ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న దౌత్యపరమైన ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి భారత్ వేదికగా ప్రారంభం కానున్న టీ20 క్రికెట్ ప్రపంచకప్ నుంచి తప్పుకుంటున్నట్లు బంగ్లాదేశ్ గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత్‌లో తమకు భద్రత లేదని.. అందుకే ఈ వరల్డ్‌కప్‌లో ఆడే తమ మ్యాచ్‌లను భారత్‌లో కాకుండా శ్రీలంకలో నిర్వహించాలని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కు బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేయగా.. దానికి ఐసీసీ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలోనే అసలు ప్రపంచకప్ ఆడకూడదని బంగ్లాదేశ్ నిర్ణయించుకుంది. ఇక ఐసీసీ ఇచ్చిన 24 గంటల గడువును బంగ్లాదేశ్ తోసిపుచ్చింది.

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లకు భారత్‌లో భద్రతా ముప్పు ఉందని ఆరోపిస్తూ.. తమ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని ఐసీసీని ఇటీవల కోరింది. ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను పంపించివేయడం వంటి పరిణామాలు తమ ఆందోళనను మరింత పెంచాయని పేర్కొంది. అయితే.. భారత్‌లో ఆటగాళ్లకు, అభిమానులకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసిన ఐసీసీ.. మ్యాచ్ వేదికలను ఎట్టి పరిస్థితుల్లో మార్చే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది.

### బంగ్లాదేశ్ కీలక నిర్ణయం

ఐసీసీ నిర్ణయంపై బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బంగ్లా క్రికెటర్లు ప్రపంచకప్ కోసం ఎంతో కష్టపడ్డారని.. కానీ భారత్‌లో భద్రతాపరమైన ఆందోళనలు అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. తమకు ఐసీసీ న్యాయం చేయాలని.. బంగ్లాదేశ్ ఆడే మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తాము ప్రపంచకప్ ఆడాలనుకుంటున్నామని.. కానీ భారత్‌లో అడుగుపెట్టమని.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం బుల్బుల్ తేల్చి చెప్పారు. తమను కాదని ఐసీసీ ముందుకు వెళ్తే అది వారి వైఫల్యమే అవుతుందని వ్యాఖ్యానించారు.

### ప్రత్యామ్నాయం ఎవరు?

ఐసీసీ నిబంధనల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు 24 గంటల గడువు ఇచ్చింది. వారు భారత్‌కు వచ్చేందుకు అంగీకరించకపోతే.. వారి స్థానంలో ఇంకో జట్టును.. టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు అనుమతించనుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో.. ఆ స్థానంలో స్కాట్లాండ్ జట్టును ప్రపంచకప్‌లోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్ కప్ గ్రూప్ దశలో భాగంగా బంగ్లాదేశ్ జట్టు 3 మ్యాచ్‌లను కోల్‌కతాలో, ఒక మ్యాచ్‌ను ముంబైలో ఆడాల్సి ఉంది.



# గుకేశ్‌కు తొలి గెలుపు

టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తొలి విజయం అందుకున్నాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఐదో రౌండ్ గేమ్‌లో గుకేశ్ 51 ఎత్తుల్లో థాయ్ డాయ్ వాన్ నుగుయెన్ (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు. తొలి నాలుగు రౌండ్ గేమ్‌లను గుకేశ్ 'డ్రా'గా ముగించడం గమనార్హం.

14 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 13 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఐదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్లు గుకేశ్ 3 పాయింట్లతో ఐదో స్థానంలో... ఇరిగేశి అర్జున్ 2.5 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో... అరవింద్ చిదంబరం 1.5 పాయింట్లతో 11వ స్థానంలో, ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో 12వ స్థానంలో ఉన్నారు. గురువారం విశ్రాంతి దినం తర్వాత నేడు ఆరో రౌండ్ గేమ్‌లు జరుగుతాయి.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

## జిల్లా వ్యవసాయాధికారి స్వరూపా రాణి



**దశ, దౌల్తాబాద్:** రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు సకాలంలో పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి స్వరూపా రాణి అధికారులకు సూచించారు.దొమ్మాట, దౌల్తాబాద్,ముబారస్పూర్ రైతు వేదికలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో స్వరూపరాణి మాట్లాడుతూ రైతులు తమ భూమి వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయితేనే రైతుబంధు,పంటల బీమా, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు వంటి ప్రభుత్వ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ అధికారులను సంప్రదించి వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రతి రైతు వివరాలు సరిగ్గా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా రోజువారీ లక్ష్యాలను నిర్ణయించి రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మల్లయ్య,ఏవో సాయికిరణ్,ఏఈఓలు సంతోష్,రజనీకాంత్,నరేష్ రెడ్డి,ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువత క్రీడా ప్రతిభకు సీఎం కప్ వేదిక

**దశ, దౌల్తాబాద్:** గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ గ్రామస్థాయి క్రీడా పోటీలు గురువారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ రమేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ గఫూర్ ఖాద్రీ, మండల విద్యాధికారి గజ్జల కనక రాజు, ఇంచార్జ్ ఎంపీఓ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ,ఉపాధ్యాయులు, పీడీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో 'మినీ దావోస్'

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించాలన్న ముఖ్యమంత్రి ప్రతిపాదనపై ఫోరం ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. దావోస్ సదస్సులో జరిగిన చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలోఅప్ సమావేశం ఎంతో ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు.ఆ విషయంలో సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని జెరెమీ జర్గెన్స్ చెప్పారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని, అలాగే సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సిఎం సమావేశంలో సమగ్రంగా వివరించారు. తెలంగాణ విజన్ లక్ష్యాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన బయోఆసియా 2024 సందర్భంగా ప్రారంభించిన సి4ఐఆర్ తెలంగాణ పురోగతిపై ఈ సమావేశంలో చర్చలు జరగడంతో పాటు ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ భారత్‌లో ప్రారంభించిన తొలి థీమాటిక్ సెంటర్ అదేనని గుర్తు చేశారు.

# నేటి నుంచి జాయ్ రైడ్

**మొదటి పేజీ తరువాయి**

- ఈ రైడ్ సమయం 7 నుంచి 10 నిముషాలు ఉంటుంది
- జాతర సందడి, భక్తుల సమూహాలు, అటవీ ప్రాంతం, దేవతల గద్దెలు ఆకాశం నుంచి చూసే అద్భుత అవకాశం
- ఒక్కో హెలికాప్టర్లో 5 నుంచి 6 మంది ప్రయాణికులు ఉండొచ్చు
- అవసరమైన సెఫ్టీ ప్రమాణాలు, శిక్షణ తీసుకున్న పైలట్లు ఉంటాయి

ఛార్జీల వివరాలు చెప్పుకుంటే.. గడిచిన సంవత్సరాల్లో ఒక్కొక్కరికి 3,700 నుంచి 4,800 వరకూ ఉంది. ఈ ఏడాది ఆ ధరలు కొంత పెరిగాయ్ 4,800 నుంచి 5 వేల రూపాయలు ఒక్కొక్కరికి వసూలు చేస్తున్నారు.

ఇక షటిల్ సర్వీస్ రైడ్ హనమకొండ నుంచి మేడారం రౌండ్ ట్రిక్ కోసం 35,999 ఉంది...ఇది రౌండ్ ట్రిప్ + వీఐపీ దర్శనం కలిగి ఉంటుంది. కానీ జాయ్ రైడ్ దీనికి పూర్తిగా భిన్నం ఇది కేవలం మేడారంలోనే ఆఫర్ చేసే షార్ట్ రైడ్. అందుకే దీని సమయం 7 నుంచి 10 నిముషాలు

ఆన్ లైన్లో www.helitaxii.com లేదా www.thumbyaviation.com వెబ్‌సైట్‌లో ఈ సేవలు బుక్ చేసుకోవచ్చు. లిమిటెడ్ స్లాట్స్ ఉంటాయి కాబట్టి ముందుగా బుక్ చేసుకోవడమే మంచిది. ఈ హెలికాప్టర్ జాయ్ రైడ్.. అడ్వెంచర్స్ ఇష్టపడేవారికి, ఫొటోగ్రఫీ ఔత్సాహికులకు అద్భుత అనుభవం. రద్దీలో చిక్కుకోకుండా జాతర సౌందర్యాన్ని వీక్షించే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది మేడారం సమ్మక్క సారలమ్మ జాతర జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరగనుంది. రెండేళ్లకోసారి జరిగే జాతర సమయంలో మేడారం జన సంద్రాన్ని తలపిస్తుంది. కేవలం తెలంగాణ నుంచి మాత్రమే కాదు... చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు

# సీటీలో రోడ్ల విస్తరణ

**మొదటి పేజీ తరువాయి**

అనుమతులు ఇచ్చింది. ఈ విస్తరణతో అవుటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవడం ప్రయాణికులకు సులభతరం కానుంది.కోకాపేట, మణికొండ, పుప్పాలగూడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు ఎంజీఐటీ నుండి మణికొండ వరకు కొత్త రహదారిని నిర్మించనున్నారు. సుమారు 3.57 కిలోమీటర్ల పొడవునా నిర్మించే ఈ మార్గాన్ని పూర్తిస్థాయిలో 6 లైన్ల రహదారిగా తీర్చిదిద్దనున్నారు. రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, వరద నీటి కాలువలు, ఆధునిక ల్యాండ్‌స్కేపింగ్‌ను ఏర్పాటు చేస్తారు. ఇది పూర్తయితే గండిపేట పరిసర ప్రాంతాల నుండి నగరంలోకి వచ్చే వాహనదారులకు పెద్ద ఉపశమనం లభిస్తుంది.బంజారాహిల్స్ ఐసీసీ టవర్ నుండి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ నగర రవాణా వ్యవస్థలో కీలక మలుపు కానుంది. రూ. 1,656 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ కారిడార్ ద్వారా బంజారాహిల్స్ నుండి గచ్చిబౌలి వరకు ఎక్కడా సిగ్నల్స్ లేకుండా ప్రయాణించవచ్చు. ఈ మార్గంలో ఫిల్మ్ నగర్, టీహబ్, ఐటీసీ కోహినూర్ వంటి కీలక జంక్షన్ల వద్ద ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. భూస్థాయిలో.. ఎలివేటెడ్ విధానంలో 4, 6 వరుసలుగా ఈ రహదారిని అభివృద్ధి చేయడం ద్వారా హైటెక్ సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు దాదాపుగా తొలగిపోనున్నాయి.

# గురుకుల విద్యను సద్వినియోగం చేసుకోవాలి

**దశ, సిద్ధిపేట:** మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని బాలుర మైనారిటీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల అడ్మిషన్స్ పోస్టర్ మరియు ప్రచార వీడియోను ముఫ్తీ అబ్దుల్ సలాం, ముఫ్తీ అబ్దుల్ కరీం పటేల్, అబ్దుల్ రహమాన్ సాహెబ్, ముఫ్తీ షరీఫ్ పటేల్ సాహెబ్, ముఫ్తీ ముజీబ్ సాహెబ్, మొహమ్మద్ మెహతాబ్, హాఫిజ్ సయ్యద్ అబ్దుల్ వాజిద్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానంగా 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ బైపీసీ, ఎంపీసీ లో మైనారిటీ విద్యార్థుల అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తునట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.